# ఆఫీసు ఆస్తి

"ఇదుగోండి సార్ మీ ఢిల్లీ టిక్కట్టు, జెట్ ఎయిర్ లైన్స్ వాళ్ళది" అని ఒక టిక్కెట్టూ, ఒక ట్రావెల్ బ్యాగ్ శ్రీహరి టేబిల్‌మీద పెట్టాడు పీ.ఆర్.వో విశ్వనాథం.

"మనం ఎప్పుడూ 'ఇండియన్ ఎయిర్‌లైన్స్'లో వెళ్లాలి కదోయ్, ఈ టిక్కెట్టెందుకు తెచ్చావు? ఈ బ్యాగేమిటి?"

"ఇండియన్ ఎయిర్‌లైన్స్ వాళ్ల సర్వీస్ గురించి మీకు తెలియనిదేముంది సార్, ఆ ఉద్యోగులెప్పుడూ ఏదో ఒక మిషపై సమ్మె చేస్తారు. సమ్మె లేనప్పుడు ఏ మినిష్టర్ మూలాన్నో ఫ్లైట్లు లేటవుతుంటాయి. జెట్ వాళ్ల సర్వీసు బాగుంటుంది. వారిచ్చే భోజనమూ, డ్రింక్స్ బాగా ఎంజాయ్ చేయవచ్చు. వారి ఛార్జి కూడా "ఇండియన్ ఎయిర్‌లైన్స్" వాళ్లంతే మూడొందలు ఖరీదుచేసే ఈ బ్యాగు కూడా ఫ్రీ."

శ్రీహరి ఆఫీసు పనిమీద హైద్రాబాదు నుండి ఢిల్లీ వెళ్లొచ్చాడు. అతనికి "జెట్‌ఎయిర్‌లైన్స్" వాళ్ల సర్వీసు చాలా నచ్చింది. వాళ్లిచ్చిన ట్రావెల్ బ్యాగ్ మరీ నచ్చింది. అది తన రెండో అల్లుడికిచ్చేశాడు. తన కూతురు చాలా సంతోషపడింది. ఈ ప్రయాణం వల్ల టి.ఎ., డి.ఎ. కూడా బాగా గిట్టుబాటయింది.

ఆర్నెల్ల తర్వాత ఆడిట్ వాళ్లొచ్చారు. టి.ఎ. బిల్లు తనిఖీ చేశారు. సెంట్రల్ ఆఫీసు ఆమోదించిన ఎయిర్‌లైన్స్‌లో కాకుండా "జెట్ ఎయిర్‌లైన్స్"లో వెళ్లినందుకు శ్రీహరిని సంజాయిషీ అడిగాడు ఆడిటరు రంగనాథం.

అతను పీ.ఆర్.వో విశ్వనాథంపై నెపం వేశాడు.

"జెట్ ఎయిర్‌లైన్స్ ప్రభుత్వ అనుమతితో నడుస్తున్న ప్రైవేట్ ఎయిర్ లైన్. వారి సర్వీసు బాగుంటుంది. ఫ్లైట్లు టైముకి నడుస్తాయి. సీట్లు కంఫర్టబుల్‌గా వుంటాయి. వారి ఛార్జిల్లో భేదం లేదు, మారుతున్న ప్రభుత్వ నీతితో పాటు మనం కూడా మారాలి కాని, ఎప్పుడో చేసిన రూల్సు పట్టుకుని, అవే పాటించాలంటే ఎలా కుదురుతుంది?" విశ్వనాథం సంజాయిషీ ఇచ్చాడు.

"సెంట్రల్ ఆఫీసు ఆమోదించని, అనుమతించని ఎయిర్‌లైన్స్ టిక్కెట్లు ఆఫీసు డ్యూటీకి చెల్లవు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసరుగా మీరు ఈ ముఖ్యమైన నిబంధనను ఉల్లంఘించారు. దీనికి మీదే బాధ్యత" శ్రీహరి ద్వారా బాగా "ట్రీట్" చేయబడిన రంగనాథం అభిప్రాయపడ్డాడు.

విశ్వనాథానికి ఉక్రోషం వచ్చింది.

"అవునండీ, ఆ టిక్కట్టు బుక్ చేసినంత మట్టుకు నా బాధ్యతే. కాదనను, కాని ఆ టిక్కెట్టుపై ప్రయాణించిన ఆఫీసరుదేం బాధ్యత లేదా? టి.ఎ., డి.ఎ.తో పాటు దాదాపు

మూడు వందల రూపాయల ట్రావెల్ బ్యాగ్ ఉచితంగా పొంది, తన రెండో అల్లుడికిచ్చిన నాపై ఆఫీసరుది పొరపాటు కాదా?"

రంగనాథం ఉలిక్కి పడ్డాడు.

"మధ్యలో ట్రావెల్ బ్యాగేమిటి?"

"జెట్ ఎయిర్‌లైన్‌వాళ్లు ఆ టిక్కట్టుపై ట్రావెల్ బ్యాగు ఫ్రీగా ఇచ్చారు.

వారం రోజుల తర్వాత, పై కేసులో నిబంధనలు ఉల్లంఘించినందుకు విశ్వనాథానికి, నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా, ఆఫీసు ఆస్తిని (ట్రావెల్ బ్యాగ్) తన స్వంతానికి ఉపయోగించుకున్నందుకు శ్రీహరికీ, వారి సంజాయిషీ కోరుతూ సెంట్రల్ ఆఫీసు నుండి శ్రీ ముఖాలు అందాయి.

ఇంతకీ వాళ్లది తప్పేనంటారా? మీ ఆఫీసులో ఇలా కాక వేరేవిధంగా అవుతుందా? నాక్కాస్త చెప్పరూ?

ప్లీజ్!